జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం | 5 | జులై | 2026 ◆ పేజీలు : 8



## హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జె. శ్రీనివాస్ రావును మర్యాద పూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్, జులై 2 ,(ప్రజా జ్యోతి)** తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిపాలనా న్యాయమూర్తి జస్టిస్ జె.శ్రీనివాస రావు జిల్లా పర్యటనలో భాగంగా శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు విచ్చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ న్యాయమూర్తిని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి జిల్లా పర్యటన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయవ్యవస్థకు చెందిన న్యాయాధికారులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.





- వయసు చిన్నదే.. సంకల్పం పెద్దది..
- పచ్చదనాన్ని జీవిత ధ్యేయంగా మలుచుకున్న భద్రాద్రి చిన్నారులు
- 'ఏక్ పెడ్ మా కే నామ్'తో నైనిక తొలి అడుగు...
- 'వనజీవి' ఆశయాలతో 'వాక్ ఫర్ ట్రీస్' నినాదమెత్తిన చౌహాన్...
- ఒకరు 300 మొక్కలు నాటి వెయ్యికి పైగా మొక్కలను బహుమతిగా అందిస్తుంటే...
- మరొకరు 6 వేలకుపైగా మొక్కలు నాటి 10 లక్షల విత్తనాలతో అటవీకరణకు ఊతమిస్తున్నారు...

# చిన్న చేతుల్లో... పెద్ద చైతన్యం

7 లో..

సండే స్పెషల్









అభివృద్ధి పేరుతో పచ్చదనం క్రమంగా కనుమరుగవుతున్న వేళ... చెట్లను పెంచడమే తమ లక్ష్యంగా ముందుకు సాగుతున్న చిన్నారులు కూడా ఉన్నారు. మొబైల్ ఫోన్లు, వీడియో గేమ్ ల ప్రపంచంలో మునిగిపోతున్న నేటి తరంలో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ఇద్దరు చిన్నారులు మాత్రం ప్రకృతినే తమ ప్రపంచంగా ఎంచుకున్నారు. ఒకరు ప్రతి పుట్టిన రోజుకు మొక్కను నాటాలని సందేశమిస్తుంటే... మరొకరు ప్రతి ఉదయం ఒక మొక్క నాటడాన్ని జీవిత నియమంగా మార్చుకున్నారు. వయసు చిన్నదే అయినా, వారు ఎంచుకున్న మార్గం మాత్రం సమాజానికి పెద్ద సందేశాన్ని ఇస్తోంది. పచ్చని భవిష్యత్తు పట్ల బాధ్యత వయసుతో రాదని... మనసుతో వస్తుందని ఈ ఇద్దరు చిన్నారులు తమ చేతలతో నిరూపిస్తున్నారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి :
(మాలోత్ అశోక్)

---

## వర్షాకాలం వ్యవసాయ సాగుకు
# అధికారులు సన్నద్ధం కావాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు
- రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండాలి
- నకిలీ విత్తనాలు, ఎరువుల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలి
- ప్రజారోగ్యం, తాగునీరు, విద్య, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి
- వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్, జులై 2( ప్రజా జ్యోతి)** రాష్ట్రంలో వర్షాకాలం వ్యవసాయ సీజన్ ను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని

మిగతా 2 లో...

## ఓటరు జాబితా సవరణ
# తప్పులు లేకుండా చేయాలి

**బూర్గంపహాడ్, జూలై4 (ప్రజాజ్యోతి):** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)లో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాలలో వివరాలను జాగ్రత్తగా నమోదు చేయాలని పినపాక నియోజకవర్గం ఈఆర్ఓ,ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ సంబంధిత బిఎల్ఓ, సూపర్వైజర్లకు సూచించారు.శనివారం బూర్గంపహాడ్ మండల కేంద్రం లోని రైతు వేదికలో మండల పరిధి లోని పోలింగ్ స్టేషన్ల బిఎల్ఓ, సూపర్వైజర్లకు సమావేశం ఏర్పాటు చేసి సమగ్ర సర్వే ఓటర్ల జాబితా సవరణలో ఎన్యుమరేషన్ ఫారాలు పూరించేటప్పుడు



తప్పనిసరిగా ఓటర్ల యొక్క జాబితా 2002 సంవత్సరములో ఓటు హక్కు ఉన్న వారి కోసం ఒక బాక్స్, 2002లో ఓటు హక్కు లేని వారి కోసం మరో బాక్స్ ఉంటుందని ఈ రెండు అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. పరిస్థితిని ఆధారంగా

మిగతా 2 లో...

## బక్క రైతులపై
# బడా బాబులు కుట్ర

- హైకోర్టు ఆదేశాలు బుట్టదాఖలు..
- కోర్టు ధిక్కరణ నోటీసులు ఇచ్చారని.. పేదలపైనే క్రిమినల్ కేసులు
- ఇదేనా ప్రజా పాలన? బాధిత రైతుల ఆక్రోశం



**అశ్వరావుపేట ఆర్సి / జూలై 4 ( ప్రజా జ్యోతి ):** భూదందాలు, దౌర్జన్యాలు పేద రైతుల ప్రాణాలు తీస్తున్నాయి. దమ్మపేట మండలం నల్లకుంట సర్వే నెంబర్ 273/1 లోని అసైన్డ్ భూములపై కన్నేసిన కొందరు పెద్దలు,బండారం స్థానికంగా తీవ్ర సంచలనంగా మారింది. ఇక్కడ భారీ భూదందా నడుస్తోందని, న్యాయం అడిగితే తమపై అక్రమ కేసులు బనాయిస్తూ దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని బాధిత రైతులు శనివారం జరిగిన మీడియా సమావేశంలో కన్నీరుమున్నీరుగా విలపిస్తూ ఆరోపించారు..

### ››› పోలీస్ స్టేషన్ కు భూమిస్తే.. అదే పోలీసులతో దౌర్జన్యం

గతంలో దమ్మపేట పోలీస్ స్టేషన్, నిర్మాణానికి తమ సొంత భూమిని ప్రభుత్వానికి దానం చేసిన మరియు.. నాడు ప్రభుత్వం భూమిలేని నిరుపేదలకు 1975లో ఈ అసైన్డ్ భూములను కొంత మంది రైతులకుకేటాయించింది. అప్పటినుండి వారు ఈ భూమిలోనే సాగు చేసుకుంటూ జీవిస్తున్నారు. రోజువారీ పూట గడవక, రోడ్డు పక్కన పప్పు సాంబార్ అమ్ముకుంటూ పొట్టపోసుకునే ఈ అభాగ్యుల భూములపై.. మాజీ ఐఏఎస్ అధికారి కుట్ర పన్నుతున్నారని..2010లోనే నాటి సబ్-కలెక్టర్ పౌసమి బసు ఈ కబ్జాదారుల కాగితాలు చెల్లవని అప్పటి కలెక్టర్ ఉషారాణికి స్పష్టమైన నివేదిక ఇచ్చారు. ఇక్కడ కొంత మంది తమ అధికారాన్ని అడ్డుపెట్టుకుని పేద రైతుల కడుపు కొడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

### ››› నిర్వీర్యమైన యంత్రాంగం

ఈ భారీ భూదందాలో ఒక రాజకీయనాయకుడి బంధువును ను ముందుపెట్టి చక్రం తిప్పుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పెద్దలు అండ ఉండటంతో స్థానిక సంబంధిత అధికారులు న్యాయం చేయలేక పోతున్నారని . హైకోర్టు (W.P. No. 31912 of 2025) స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా సరే, వాటిని బేఖాతరు చేస్తూ. పోలీస్ స్టేషన్లలో రైతులపైనే ఫిర్యాదులు చేయించి వారిని స్టేషన్ల చుట్టూ తిప్పడం రాష్ట్రంలో దిగజారిన శాంతిభద్రతలకు అద్దం పడుతోంది. అధికారుల తీరుపై రైతులు లాయర్ ద్వారా 'కోర్టు ధిక్కరణ' నోటీసులు ఇచ్చారనే కక్షతో.. రైతులపైనే జూలై 2న పోలీసులు హడావుడిగా క్రిమినల్ కేసులు బనాయించడం పాలకుల పక్షపాత వైఖరిని బట్టబయలు చేస్తోంది.

### ››› గుండె ఆగి చనిపోతున్నా.. కరగని ప్రభుత్వ పెద్దల మనసులు...

ఈ భూపోరాటంలో నాయకుల వేధింపులు, అధికారుల బెదిరింపులు తట్టుకోలేక, తమ జీవనాధారం పోతుందనే ఆవేదనతో గుండెపోటుకు గురై రైతులు ప్రాణాలు వదులుతున్నా ప్రభుత్వ పెద్దల రాతి మనసులు కరగడం లేదు. కబ్జాదారులకు ఒక న్యాయం, పేదలకు ఒక న్యాయమా? అని రైతులు ప్రభుత్వాన్ని సూటిగా నిలదీస్తున్నారు."మా ప్రాణాలు పోయినా సరే ఈ మట్టిని వదలం. ఈ మాఫియా నుండి మమ్మల్ని కాపాడాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వం ఉందని అన్నారు ఈ కుట్రలపై జిల్లా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు లు వెంటనే స్పందించి, కొంతమంది అండతో నడుస్తున్న ఈ భూదందాను అడ్డుకోవాలి. మాపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి" అని జంగాల వెంకటేశ్వరరావు, మళ్ళా వెంకటేశ్వరరావు, మళ్ళా కమల, బొగ్గం శివ, బొగ్గం రాజు, గోళ్ళ భవాని కృష్ణ, గట్ల సర్వేశ్వరరావు తదితర బాధిత రైతులు ప్రభుత్వాన్ని కోరేరు.

## వర్షాకాలం వ్యవసాయ సాగుకు
# అధికారులు సన్నద్ధం కావాలి

(మొదటి పేజీ తరువాయి...)

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు. శనివారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో కలిసి వ్యవసాయం, విత్తనాలు, ఎరువులు, ప్రజారోగ్యం, పంటల వైవిధ్యీకరణ, రైతు రిజిస్ట్రీ, తాగునీరు, నీటిపారుదల, విద్య, వాతావరణ మార్పులు, ఉద్యానవనం, సూక్ష్మ సాగునీరు, ఆయిల్ పామ్ విస్తరణ, మధ్యాహ్న భోజన పథకం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలో వర్షాకాలం–2026 సీజన్ లో 138.49 లక్షల ఎకరాల్లో సాగు లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు.రైతులకు అవసరమైన మేరకు 99.13 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు, నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, ఇప్పటికే 510.93 క్వింటాళ్ల నకిలీ విత్తనాలను స్వాధీనం చేసుకుని, 68 మందిని అరెస్టు చేసి, 34 క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. జూలై నెలకు అవసరమైన ఎరువులను ముందస్తుగా నిల్వ ఉంచాలని, యూరియా అక్రమ రవాణా, అధిక ధరలకు విక్రయాలు, నిల్వలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని సూచించారు. నానో యూరియా వినియోగాన్నిరైతుల్లో విస్తృతంగా ప్రోత్సహించాలని తెలిపారు. రైతు రిజిస్ట్రీ కార్యక్రమంలో తెలంగాణ దేశంలోనే ముందంజలో ఉందని పేర్కొంటూ, అర్హులైన ప్రతి



రైతు నమోదు పూర్తయ్యేలా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశిం చారు.పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యత ఇస్తూ వరితో పాటు పప్పు ధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలని, ఆయిల్ పామ్ సాగు విస్తరణ, ఉద్యాన పంటల అభివృద్ధి, సూక్ష్మ సాగునీటి ప్రాజెక్టుల అమలులో జిల్లాల వారీగా పురోగతిని వేగవంతం చేయాలని సూచించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేసి, జిల్లా, డివిజన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలో ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. సున్నిత ప్రాంతాల్లో జ్వరాలపై ప్రత్యేక నిఘా చేపట్టి ప్రతిరోజూ నివేదికలు పంపాలని, ప్రతి శుక్రవారం "డ్రై డే" నిర్వహిస్తూ దోమల నివారణ, లార్వా నిర్మూలన, ఫాగింగ్, నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. గత ఏడాదితో పోలిస్తే డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా కేసులు తగ్గినప్పటికీ టైఫాయిడ్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. గర్భిణుల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, ప్రసవ తేదీలను ముందుగానే గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఆసుపత్రుల్లో మందులు, పరీక్షా కిట్లు, రక్త నిల్వలు, అంబులెన్స్ సేవలు, అత్యవసర చికిత్స సౌకర్యాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజారోగ్య పరిరక్షణలో వైద్య ఆరోగ్య శాఖతో పాటు మున్సిపల్, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, విద్య, ఐసీడీఎస్, గిరిజన సంక్షేమ, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి నాణ్యత, పాఠశాలలు, వసతి గృహాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో అల్పాహారం, మధ్యాహ్న భోజన పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించాలని, ఆహార తయారీ నుంచి పంపిణీ వరకు పరిశుభ్రత ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. విద్యార్థుల హాజరుకు అనుగుణంగా ఫేషియల్ రికగ్నిషన్ విధానం ఆధారంగా ఆహార అవసరాలను అంచనా వేసి వ్యర్థాలను నివారించాలని, డిజిటల్ డ్యాష్ బోర్డ్ ద్వారా పథకం అమలును జిల్లా కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ వానాకాలంలో రైతులు, విద్యార్థులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో వానాకాలం వ్యవసాయానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉంచామని తెలిపారు. రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించడంతో పాటు రైతు రిజిస్ట్రీ నమోదు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. తాగునీటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందని, ప్రభుత్వ పాఠశాలలను క్రమం తప్పకుండా సందర్శిస్తూ విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్, జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారాం రాథోడ్, జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి, మిషన్ భగీరథ ఈఈ నళిని, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు

## నూతన కోర్టు నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

**ఇల్లందు, జూలై 4 (ప్రజా జ్యోతి)**



ఇల్లందులో నూత న సబ్ కోర్టు, నూతన కోర్టు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని తెలంగాణ హైకోర్టు ( అడ్మినిస్ట్రేటివ్ అండ్ పోర్టు పోలియో ) జడ్జి జె శ్రీని వాసరావు ను శనివారం ఇల్లందు బా ర్ అసో సియేషన్ అధ్యక్షుడు భూక్య రవి కుమార్ నాయక్ ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మాట్లాడుతూ ఇల్లందులో ని కోర్టులో అనేక సమస్యలు నెలకొన్నాయని వాటిని త్వరితగతిన పరిష్క రించాలని కోరారు. స్పందించిన తెలంగాణ హైకోర్టు ( అడ్మినిస్ట్రేటివ్ అండ్ పో ర్టు పోలియో ) జడ్జి సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని పేర్కొన్నట్లు భూక్యా రవికుమార్ నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జా యింట్ సెక్రటరీ సిహెచ్ నవీన్ కుమార్, కోశాధికారి బన్సీలాల్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు

## ఓటరు జాబితా సవరణ తప్పులు లేకుండా చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

నిర్ణయించుకొని ఎన్యుమరేషన్ ఫారం నింపాలని అన్నారు. ప్రజల నుండి పూర్తిస్థాయి వివరాలు తెలుసుకొని తప్పులు లేకుండా నమోదు చేయాలని అన్నారు.ప్రస్తుతం నివాసం ఉన్న 2002 సంవత్సరానికి ఓటరు జాబితాలో ఓటు లేకపోతే బంధువుల్లో ఉన్న వారి వివరాలను ఈ బాక్స్ లో నింపాలని సూచించారు. మూడో భాగంలో ఓటరు ప్రస్తుతం వివరాలతో నింపాలని, అభ్యర్థి యొక్క పుట్టిన తేదీ ఆధార్ కార్డు నెంబర్,మొబైల్ నెంబర్, సంరక్షుడి పేరు,సంరక్షుడి ఓటరు గుర్తింపు కార్డు నెంబర్, తల్లి పేరు, తల్లి ఓటర్ గుర్తింపు కార్డు నెంబరు తప్పనిసరిగా ఇవ్వాలని అన్నారు.భవిష్యత్తులో ఓటర్ యొక్క ఓట్లు గల్లంతు కాకుండా ఉండాలంటే ఓటర్లు సరైన పత్రాలు ఆధార్ కార్డు ,జనన ధ్రువీకరణ పత్రం, పాస్ కార్డు, పదో తరగతి, సర్టిఫికెట్, శాశ్వత నివాసం ధ్రువీకరణ పత్రం, అటవీ హక్కుల ధ్రువీకరణ పత్రం, ఎస్సీ ఎస్టీ ఓబీసీలకు ధ్రువీకరణ పత్రం, ఇంటి అద్దె రసీదు, లేదా కరెంటు బిల్లు, వంటి పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. కాగా వివరాలు బిఎల్ఓ లకు అందించటం వల్ల భవిష్యత్తులో ఓటరు కార్డులో పేరు గల్లంతు కాకుండా ఉంటుందని అదేవిధంగా ఓటరు జాబితాలో తప్పులు లేకుండా చూడటం ద్వారా ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి ఆటంకాలు లేకుండా మనం ఓటు హక్కు వినియోగించుకోవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో పివిటిజి అధికారి గన్యా నాయక్, తహశీల్దార్ కేఆర్ కే ప్రసాద్, డిటి సమ్మయ్య, బిఎల్వోలు, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# పీఏసీఎస్‌లో సీఎస్‌సీ సేవల ప్రారంభం

- ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్. తెల్లం వెంకట్రావు






**చర్ల, జూలై 04(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలోని చర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) భవనంలో కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్సీ)ను ముఖ్య అతిథిగా పాల్గొన్న భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు శనివారం ప్రారంభించారు.ఈ సందర్భగాఎమ్మెల్యే మాట్లాడుతూ సహకార సంఘాల ఆధ్వర్యంలో కామన్ సర్వీస్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం ఒక వినూత్న కార్యక్రమమని గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ఈ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుత కాలంలో ప్రభుత్వ సేవలు ఎక్కువగా ఆన్‌లైన్ విధానంలో అందుబాటులోకి వస్తున్న నేపథ్యంలో గ్రామీణ ప్రజలకు సులభంగా సేవలు అందించేందుకు కామన్ సర్వీస్ సెంటర్లు ఎంతో ఉపయోగకరంగా పనిచేస్తాయని ఆధార్, పాన్ కార్డు, ఆదాయ, కుల, నివాస ధ్రువపత్రాలు, పెన్షన్ దరఖాస్తులు, వివిధ సంక్షేమ పథకాల నమోదు, విద్యుత్ బిల్లులు, నీటి బిల్లులు, బీమా, బ్యాంకింగ్ సేవలు తదితర అనేక సేవలను ఒకే వేదికపై ప్రజలకు అందించేందుకు సీఎస్సీ ఉపయోగపడుతుందని అన్నారు.రైతులకు, వ్యవసాయ కూలీలకు, విద్యార్థులకు, మహిళలకు, వృద్ధులకు అవసరమైన అనేక డిజిటల్ సేవలు ఇకపై స్థానికంగానే అందుబాటులో ఉంటాయని తెలిపారు. చిన్న చిన్న పనుల కోసం మండల కేంద్రాలు లేదా జిల్లా కేంద్రాలకు వెళ్లి సమయం, డబ్బు వృథా చేసుకోవాల్సిన అవసరం లేకుండా ప్రజలు తమ గ్రామానికి సమీపంలోనే అన్ని రకాల సేవలను పొందవచ్చని చెప్పారు.సహకార వ్యవసాయ పరపతి సంఘాలను కేవలం రుణాల పంపిణీ సంస్థలుగానే కాకుండా ప్రజలకు బహుముఖ సేవలు అందించే కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే అన్నారు . ఈ కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా రైతులు, ప్రజలకు సహకార సంఘం మరింత చేరువ అవుతుందని, భవిష్యత్తులో మరిన్ని సేవలను కూడా ఈ కేంద్రం ద్వారా అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో చర్ల పీఏసీఎస్ సిబ్బంది కీలక పాత్ర పోషించాలని ఎమ్మెల్యే సూచించారు. ఉద్యోగ వేళలకు అతీతంగా కూడా ప్రజలకు అవసరమైన సేవలను అందించేందుకు చొరవ చూపాలని ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించే విధంగా సేవలు అందించాలని కోరారు. సేవాభావంతో పనిచేస్తే ఈ కేంద్రం ప్రజల విశ్వాసాన్ని పొందడంతో పాటు సహకార సంఘం ప్రతిష్ఠ మరింత పెరుగుతుందని అన్నారు.ప్రజలు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా అందించే సేవలను విస్తృతంగా వినియోగించుకోవాలని, డిజిటల్ సేవలను గ్రామీణ ప్రాంతాల్లో మరింత విస్తరించేందుకు సహకరించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ పరిపాలనను బలోపేతం చేయడంలో చర్ల పీఏసీఎస్‌లో ప్రారంభించిన ఈ కామన్ సర్వీస్ సెంటర్ ఆదర్శవంతంగా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలోమండల తాసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో ఈదయ్య, చర్లపిఏసిఎస్ చైర్మన్ పరిచరి రవి కుమార్, డి రామచంద్ర ప్రభు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యదర్శి ,అసిస్టెంట్ రిజిస్టర్ అండ్ మానిటరింగ్ ఆఫీసర్ టి సుజాత ,చర్ల వ్యవసాయ అధికారి లావణ్య,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండారు రామకృష్ణ ,చర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్పా శ్రీనివాసరావు, చర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్ నాయుడు, ఇతర కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అల్లూరి జయంతి వేడుకలు



**చర్ల, జూలై 04(ప్రజా జ్యోతి ) :** మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా శనివారం చర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విశ్వ హిందూ పరిషత్ చర్ల ప్రఖండ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా చేసిన పోరాటం ఆయన త్యాగనిరతి దేశభక్తి భావన యువతకు ఆదర్శప్రాయమైన వ్యక్తిత్వాన్ని విద్యార్థులకు వివరించారు. అల్లూరి ఆశయాలను నేటి తరం యువత ఆదర్శంగా తీసుకుని దేశసేవకు అంకితభావంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.విద్యార్థుల్లో దేశభక్తి భావాన్ని పెంపొందించే ఉద్దేశంతో ఈ శనివారం అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్ర ఆధారంగా రూపొందించిన చిత్రాన్ని పాఠశాలలో ప్రదర్శించనున్నట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు.ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ చర్ల ప్రఖండ సభ్యులు శివరాజ్ కిషోర్, ఇరసవడ్ల రాము, మీసాల శ్రీనివాస్, వెంకట్రావు, గోలీకార్ ప్రేమ్ కుమార్, గాదెశెట్టి దీప్, తోటపల్లి వంశీ, గుంటుపల్లి రమేష్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ విఘ్నేశ్వర స్వామి కళ్యాణం



**చర్ల, జూలై 04(ప్రజా జ్యోతి ):** చర్ల మండలం తేగడ గ్రామంలోని శ్రీ విఘ్నేశ్వర స్వామి ఆలయంలో శనివారం స్వామివారి కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడగా, పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ స్వామివారి దివ్య కళ్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు, దాతల సహకారంతో కళ్యాణ మహోత్సవం విజయవంతంగా నిర్వహించారు . స్వామివారి కళ్యాణ వేడుకలో పెళ్లి పీటలపై చింతల రవికుమార్ దంపతులు, కోసరాజు హరిచరణ్ దంపతులు కళ్యాణ దంపతులుగా పాల్గొన్నారు వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు స్వామివారి ఆశీస్సులు పొందారు.భక్తులు సమర్పించిన విరాళాలు దాతలు అందించిన సహకారంతో అన్నప్రసాద కార్యక్రమాన్ని ఘనంగా ఏర్పాటు చేయగా, భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగిన ఈ కళ్యాణ మహోత్సవం భక్తులను విశేషంగా ఆకట్టుకున్నది.

## వార్డు అభివృద్ధికి వార్డు కమిటీ అత్యంత కీలకం



**ఇల్లందు, జులై 4 (ప్రజా జ్యోతి)** వార్డు అభివృద్ధిలో వార్డు కమిటీ అత్యంత కీలకపాత్ర వహిస్తుందని మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బోళ్ల సూర్యం లు అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని 16వ వార్డులో ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదేశాల మేరకు వార్డు కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డులో ప్రజల సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటిని త్వరితగతిన పరిష్కరించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడైన ప్రతి లబ్ధిదారుడికి చేరేలా కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ప్రజలతో నిత్యం అందుబాటులో ఉంటూ వార్డు అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో 16వ వార్డు కౌన్సిలర్ ఉల్లింగ విజయ లక్ష్మి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మడుగు సాంబమూర్తి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జీవీ భద్రం, కౌన్సిలర్ చిల్లా విజయభారతి, మహిళా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షురాలు గాలిపల్లి స్వరూప, మహిళా కమిటీ సభ్యులు శ్వేత, మడుగు వెంకటలక్ష్మి, కమలమ్మ, చెంచమ్మ, నాయకులు ఉల్లింగ సతీష్, ఖాదర్, ఊట్ల రాజేష్, ఊట్ల రాందాస్, నామవరపు సంజీవ్, సంతోష్, మౌలాలి, ఏర్పుల సంతోష్, గాయత్రి, చెరుకూరి వీరేందర్, సుజాత, నాగలక్ష్మి, ప్రసన్న, కళ్యాణ్, ఖాజా, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, మహిళలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించిన సర్పంచ్

- విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచనలు





**అన్నపురెడ్డిపల్లి, జూలై 4 (ప్రజా జ్యోతి ):** అన్నపురెడ్డిపల్లి మండలం మర్రిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని రామకృష్ణాపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాన్ని సర్పంచ్ కోండ్రు సృజన శనివారం సందర్శించారు. పాఠశాల, అంగన్వాడీ కేంద్రంలో విద్యార్థులు, చిన్నారులకు అందుతున్న సేవలు, మౌలిక సదుపాయాలు, పరిశుభ్రత, భోజన ఏర్పాట్లను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. అలాగే పాఠశాల, అంగన్వాడీ కేంద్రాల్లో పరిశుభ్రమైన వాతావరణాన్ని నిరంతరం కొనసాగించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కోండ్రు రత్నం బాబు, సవలం కృష్ణ, ఆత్మ కమిటీ డైరెక్టర్ పొట్ట రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## సీపీఎం బీఎల్ఏ ఏజెంట్ల నియామకం




**చర్ల, జూలై 04: (ప్రజా జ్యోతి ):** చర్లలోని బీఎస్ రామయ్య భవనంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో పార్టీ తరఫున 17 మంది బీఎల్ఏ ఏజెంట్లను నియమించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి మచ్చ రామారావు మాట్లాడుతూ ప్రతి బీఎల్ఏ ఏజెంట్ సంబంధిత బీఎల్ఓలతో సమన్వయంగా పనిచేస్తూ ఓటరు జాబితా సర్వే కార్యక్రమాన్ని బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు. ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియలో ప్రజలకు సహకరించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు బందెల చంటి, పొడుపుగంటి సమ్మక్క, భీమగోని నవీన్, వరదల వరలక్ష్మి, మచ్చ రాము, గంధం శ్రావ్య, రావులపల్లి లక్ష్మి, పలక సైలు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ టీచర్ ఖాళీల భర్తీకి దరఖాస్తులకు ఆహ్వానం

- **బూర్గంపహాడ్ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి కేఎం తార**



**బూర్గంపహాడ్,జూలై 4(ప్రజా జ్యోతి):** ఐసీడీఎస్ ప్రాజెక్ట్ బూర్గంపహాడ్ పరిధి లోని అంగన్వాడీ కేంద్రాలలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయబడినది అని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి కె ఎం తార శనివారం నాడు ప్రకటనలో తెలిపారు. నోటిఫికేషన్ కు సంబంధించిన పోస్టుల వివరాలు, అర్హతలు, దరఖాస్తు విధానం, అవసరమైన ధృవపత్రాలు, దరఖాస్తు చేసుకోవాల్సిన వెబ్సైట్ వివరాలు మరియు ఇతర సమాచారాన్ని సంబంధిత గ్రామపంచాయతీ కార్యాలయాల నోటీస్ బోర్డులపై, మండల కార్యాలయాల నోటీస్ బోర్డులపై ప్రదర్శించడం జరిగిందని తెలిపారు.అదేవిధంగా, దరఖాస్తు చేసుకునే వెబ్సైట్ చిరునామా కూడా నోటిఫికేషన్ లో స్పష్టంగా పొందుపరచినట్లు తెలియజేశారు. అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు నోటిఫికేషన్ను పూర్తిగా పరిశీలించి, అందులో పేర్కొన్న వెబ్సైట్ ద్వారా నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవలసిందిగా కోరారు.ఈ అవకాశాన్ని అర్హులైన మహి ళా అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## తపాలా శాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- **సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి**





**ములకలపల్లి, జులై 04, (ప్రజాజ్యోతి):** భారత తపాలా శాఖ అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మూకమామిడి సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని మూకమామిడి గ్రామంలో పోస్ట్ ఆఫీస్ నందు భారత తపాలా శాఖ అందిస్తున్న సేవలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మూకమామిడి గ్రామపంచాయతీ సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి పాల్గొని మాట్లాడారు. గ్రామ ప్రజలు పోస్టాఫీస్ అందిస్తున్న వివిధ పొదుపు, బీమా, ఆర్థిక సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. పాల్వంచ సబ్ డివిజనల్ ఇన్స్పెక్టర్ మాలోత్ వీరన్న మాట్లాడుతూ భారత తపాలా శాఖ అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. పోస్టాఫీస్ సేవింగ్స్ అకౌంట్, రికరింగ్ డిపాజిట్, టైమ్ డిపాజిట్, మంత్లీ ఇన్కమ్ స్కీమ్, సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్, పీపీఎఫ్, సుకన్య సమృద్ధి యోజన, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, గ్రామీణ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ వంటి పథకాల ద్వారా భద్రంగా పెట్టుబడులు పెట్టవచ్చని తెలిపారు. ఆధార్ సేవలు, ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ సేవలు, నగదు లావాదేవీలు, మనీ ట్రాన్స్ఫర్, స్పీడ్ పోస్ట్, రిజిస్టర్డ్ పోస్ట్ వంటి సేవలు కూడా అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎం. దుర్గాప్రసాద్, వార్డు సభ్యులు భూక్య అశోక్, గ్రామ పెద్దలు శాస్త్రబోయిన వెంకటేశ్వర్లు, సున్నం వీరస్వామి, పైదా కోటేష్, మాలోత్ రవీందర్, తపాలా శాఖ సిబ్బంది ఎస్. ప్రవీణ్, ఎల్. లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణను

# నిర్ణీత గడువులో పూర్తి చేయాలి

- **ఆర్ అండ్ ఆర్, ఇరిగేషన్ భూసేకరణ కమిషనర్ శివకుమార్ నాయుడు**







**కొత్తగూడెం కలెక్టరేట్, జులై 2, (ప్రజా జ్యోతి)**

జిల్లాలో కొనసాగుతున్న నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి, పెండింగ్‌లో ఉన్న అంశాలను సత్వరమే పరిష్కరించాలని ఆర్ అండ్ ఆర్, ఇరిగేషన్ భూసేకరణ కమిషనర్ కె. శివకుమార్ నాయుడు సంబంధిత అధికారులను ఆదేశించారు.శనివారం హైదరాబాద్ నుండి రెవెన్యూ, ఇరిగేషన్, సర్వే, భూసేకరణ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, జిల్లాలో కొనసాగుతున్న నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా కలెక్టర్ అంకిత్ ఐడీఓసీ కార్యాలయం క్యాంపు కార్యాలయం నుండి పాల్గొన్నారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అన్నారు. ప్రస్తుతం వివిధ దశల్లో కొనసాగుతున్న భూసేకరణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూసేకరణకు సంబంధించి సర్వే ప్రక్రియను వేగవంతం చేసి, రోజుకు 15 ఎకరాల చొప్పున లక్ష్యాన్ని నిర్దేశించుకుని రెండు నెలల్లో భూసేకరణ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రతి సర్వే బృందం ప్రతిరోజూ ఉదయం 8.30 గంటలకే క్షేత్రస్థాయిలో ఉండాలని, రైతులకు సంబంధించిన అంశం కావడంతో వారు పొలాల వద్ద అందుబాటులో ఉండే సమయంలోనే సర్వే నిర్వహించాలని సూచించారు. అలాగే, మరుసటి రోజు ఏ గ్రామంలో సర్వే నిర్వహించనున్నారో ముందుగానే నోటీసుల ద్వారా రైతులకు తెలియజేయాలని అన్నారు. రైతులు అందుబాటులో ఉన్న సమయంలోనే సర్వే పూర్తి చేయడం ద్వారా భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయవచ్చని తెలిపారు.సర్వే నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ, సర్వే, ఇరిగేషన్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే భూసేకరణ ప్రక్రియను నిర్ణీత గడువులో పూర్తి చేయడం సాధ్యమవుతుందని అన్నారు . భూసేకరణకు సంబంధించిన పురోగతి వివరాలను ప్రతిరోజూ నివేదికల రూపంలో అందించాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రక్రియపై ప్రత్యేక దృష్టిసారించిందని, రెండు నెలల్లో భూసేకరణ పూర్తి చేసేలా అధికారులు క్షేత్రస్థాయిలో పని చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో కొనసాగుతున్న నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ సర్వేను నిర్ణీత గడువులో పూర్తి చేసేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుని ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, రెవెన్యూ, సర్వే, ఇరిగేషన్ శాఖల మధ్య సమన్వయంతో పనులు కొనసాగిస్తున్నామని తెలియజేశారు, భూ సర్వే నిర్వహణ కోసం ఏడు ప్రత్యేక సర్వే బృందాలను ఏర్పాటు చేశామని, సుమారు 3,000 ఎకరాల భూమి సర్వేను రెండు నెలల్లో పూర్తి చేసే లక్ష్యంతో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రతి బృందం ప్రతిరోజూ నిర్దేశిత లక్ష్యాల మేరకు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని, రైతులకు ముందస్తు సమాచారం అందించి వారి సహకారంతో సర్వే ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని చెప్పారు. సర్వేలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని భూసేకరణ సర్వేను నిర్ణీత గడువులో పూర్తిచేసేలా అన్ని చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రవీంద్రనాథ్, వెంకట్రావు,రెవెన్యూ, ఇరిగేషన్, సర్వే, భూసేకరణ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక సేవలో ముందున్న దాతలు

- **దేవాలయ నిర్మాణానికి చేయూత.. మూడు లక్షల విరాళం అందజేత**

**దమ్మపేట,జూలై .4, (ప్రజాజ్యోతి):** దమ్మపేట మండలం మల్లారం గ్రామంలో నూతనంగా నిర్మించ తలపెట్టిన శ్రీ రామాలయ నిర్మాణానికి విరాళాల వెల్లువ కొనసాగుతోంది. శనివారం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ పెద్ద రావు గంగాధరరావు ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణ నిధికి విరాళం అందజేశారు.ముష్టిబండ గ్రామపంచాయతీ సర్పంచ్ సిద్దిన రాధా చలపతిరావు, మల్లారంకు చెందిన గుజ్జుల శ్రీనివాసరావు సహకారంతో ఆలయ ముఖద్వారం నిర్మాణం , ఇతర పనుల కోసం రూ.3 లక్షల భారీ విరాళాన్ని గ్రామ పెద్దలు, మహిళలు, ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో అందించారు. దేవాలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, గ్రామంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించనున్న శ్రీ రామాలయానికి ఉదారంగా విరాళం అందించి తమ వంతు సహకారం అందించిన రావు గంగాధరరావు, సర్పంచ్ సిద్దిన రాధా చలపతిరావు, గుజ్జుల శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రామాలయ నిర్మాణానికి గ్రామ ప్రజలంతా ఆధ్యాత్మిక భావనతో సహకరించడం అభినందనీయమని పేర్కొన్నారు. యువ నాయకుడు పండు బాబు (రవిశంకర్), కారుమంచి పుల్లా రావు, బుద్ధరాజు, సిద్దిన కేశవులు, కారుమంచి శ్రీకాంత్, భేతి గుండమ్మతో పాటు పలువురు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.



## మహా గణపతి కళ్యాణం



**చర్ల, జూలై 04(ప్రజా జ్యోతి ):** చర్ల మండలం తేగడ గ్రామంలోని అతి పురాతన శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవాలయ అంతర మండపంలో కొలువై ఉన్న శ్రీ సిద్ధి–బుద్ధి సమేత మహా గణపతికి సంకటహర చతుర్థి సందర్భంగా శనివారం మహా కళ్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఉదయం 4 గంటల నుంచి మహా గణపతికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం గరికతో అష్టోత్తర శతనామార్చన నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 8 గంటల నుంచి వేద మంత్రోచ్చారణల మధ్య మహా గణపతి కళ్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.కళ్యాణ కార్యక్రమంలో భాగంగా పసుపు గణపతి పూజ, బాసిక ధారణ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, షటారి సేవ, మధుపర్క ప్రాశనం, గోత్రప్రవరాల పఠనం, కన్యాదానం తదితర వైదిక క్రతువులను ఆలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ వేడుకలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.ఆలయ నిర్వాహకులు యల్లమందల శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు యల్లమందల భానుప్రకాశ్ కళ్యాణ మహోత్సవాన్ని వేదోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా సేవలందించిన దాతలు, భక్తులందరికీ అర్చకులు మంగళాశాసనాలు అందజేసి, వారి కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని ఆశీర్వదించారు.కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహా గణపతి కళ్యాణ మహోత్సవాన్ని విజయవంతం చేశారు.

# వర్షాకాలంలో అప్రమత్తతే రక్షణ

- సీజనల్ వ్యాధులు, ప్రమాదాల నివారణకు అన్ని శాఖల అప్రమత్తత
- ప్రజలు,రైతులు,విద్యార్థులు తప్పనిసరిగా పాటించాల్సిన సూచనలు
- విద్యుత్ శాఖ పని ఏమిటి..? వారి చర్యలు ఏమిటి..?

**టేకులపల్లి, జూలై 04,ప్రజాజ్యోతి:** వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజల ప్రాణాలు, ఆరోగ్యం, రైతుల పంటలు, విద్యార్థుల భద్రతకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ప్రభుత్వ శాఖలు అప్రమత్తమయ్యాయి. సీజనల్ వ్యాధులు, ఉరుములు–మెరుపులు, పాముకాట్లు, విద్యుత్ ప్రమాదాలు, వరదల ముప్పు, పంటల నష్టం వంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆరోగ్య శాఖ, వ్యవసాయ శాఖ, పోలీసు శాఖ, విద్యాశాఖ సమన్వయంతో ప్రజలకు అవగాహన కల్పిస్తూ, అవసరమైన చర్యలు చేపడుతున్నాయి.

### ››› ఆరోగ్యమే మహాభాగ్యం... పరిశుభ్రతే ప్రధాన ఆయుధం

వర్షాకాలంలో వైరల్ జ్వరాలు, డెంగీ, మలేరియా, విరేచనాలు వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు మరిగించిన లేదా శుద్ధి చేసిన నీటినే తాగాలని వైద్యులు సూచిస్తున్నారు. వేడి ఆహారం తీసుకోవడం, పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడడం, దోమల నివారణ చర్యలు పాటించడం తప్పనిసరి అన్నారు. జ్వరం, దగ్గు, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తే స్వీయ చికిత్సకు పాల్పడకుండా వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని సూచించారు.

### ››› రైతులకు పోలీసుల హెచ్చరిక

ఉరుములు, మెరుపుల సమయంలో పొలాలకు వెళ్లొద్దుభారీ వర్షాలు, ఉరుములు, మెరుపుల సమయంలో రైతులు పొలాల్లో పనులు చేయవద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు. చెట్ల కింద నిలబడటం, విద్యుత్ స్తంభాల వద్ద ఆశ్రయం పొందడం ప్రమాదకరమని పేర్కొన్నారు. వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నప్పుడు వాటిని దాటేందుకు ప్రయత్నించవద్దని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

### ››› శాస్త్రీయ సాగుతోనే పంటల రక్షణ

వ్యవసాయ అధికారులు రైతులకు వర్షపాతం పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలని సూచించారు. పొలాల్లో నీరు నిల్వ కాకుండా కాలువలు ఏర్పాటు చేయడం, తెగుళ్ల నివారణకు అధికారుల సూచించిన మందులనే వినియోగించడం, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు ఉపయోగించడం ద్వారా దిగుబడి మెరుగుపడుతుందని తెలిపారు. పంటల బీమా పథకాలను రైతులు తప్పకుండా వినియోగించుకోవాలని సూచించారు.

### ››› సిద్ధంగా వైద్యశాఖ

అందుబాటులో మందులు, ప్రత్యేక వైద్య సేవల వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, వైద్య సిబ్బందిని సిద్ధంగా ఉంచినట్లు వైద్యశాఖ తెలిపింది. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు, ప్రత్యేక వైద్య శిబిరాలు, దోమల నివారణ చర్యలు, తాగునీటి నాణ్యతపై పర్యవేక్షణ కొనసాగుతున్నట్లు వెల్లడించింది.

### ››› విద్యార్థుల భద్రతే లక్ష్యం... పాఠశాలల్లో ప్రత్యేక చర్యలు

పాఠశాలల్లో భవనాల భద్రత, పైకప్పుల లీకేజీలు, విద్యుత్ వ్యవస్థలను పరిశీలించాలని విద్యాశాఖ ఆదేశించింది. విద్యార్థులు నీటి గుంటలు, కాలువలు, ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించింది. ప్రజల సహకారంతోనే సురక్షిత వర్షాకాలంవర్షాకాలంలో అప్రమత్తతతో వ్యవహరిస్తే ప్రాణనష్టం, ఆస్తినష్టం, సీజనల్ వ్యాధులు, పంటల నష్టాలను గణనీయంగా తగ్గించవచ్చని అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖలు చేపడుతున్న చర్యలకు ప్రజలు సహకరించి, సూచనలు పాటిస్తే ఆరోగ్యకరమైన, సురక్షితమైన వర్షాకాలాన్ని గడపవచ్చని విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో ప్ర తి కుటుంబం అప్రమత్తంగా ఉండి వ్య క్తిగత, సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని అధికారులు కోరుతున్నారు.

### ››› విద్యుత్ శాఖ అప్రమత్తం

విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ లోపాలను వెంటనే సరిచేస్తున్నారు. తెగిపోయిన విద్యుత్ తీగలు కనిపిస్తే వాటి వద్దకు వెళ్లకుండా వెంటనే విద్యుత్ శాఖకు సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నారు. వర్షం సమయంలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇనుప కంచెలను తాకరాదని హెచ్చరిస్తున్నారు. పొలాల్లో విద్యుత్ మోటార్లు ఆన్ చేసే ముందు వైరింగ్, ఎర్తింగ్ సక్రమంగా ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలని రైతులకు సూచించారు. భారీ వర్షాలు, గా లుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే ప్రజలు స్వయంగా మరమ్మతులకు ప్రయత్నించకుండా అధికారులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. అత్యవసర పరిస్థితుల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కోసం ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉంచినట్లు అధికారులు తెలిపారు.

# ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్




**కొత్తగూడెం కలెక్టరేట్, జూలై 2,(ప్రజా జ్యోతి)** జిల్లాలో ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలను ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక, వనమహోత్సవం, సీజనల్ వ్యాధుల నివారణ, పారిశుధ్య నిర్వహణ, ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ, విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం, ఏకరూప దుస్తుల పంపిణీతో పాటు ఇతర ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలుపై శనివారం సంబంధిత శాఖల అధికారులతో ఐడిఓసి కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామ స్థాయిలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా పనిచేయాలని సూచించారు. ప్రతి శాఖకు నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువులో పూర్తి చేసి, పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. వనమహోత్సవం కార్యక్రమంపై కలెక్టర్, జిల్లాలో శాఖలవారీగా నాటిన మొక్కల సంఖ్య, సాధించిన లక్ష్యాలు, పెండింగ్ లక్ష్యాలు, మొక్కల సంరక్షణకు చేపడుతున్న చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించేలా కార్యాచరణను వేగవంతం చేయాలని, నాటిన ప్రతి మొక్క జీవించేలా నీటి వసతి, ట్రీ గార్డులు, క్రమం తప్పకుండా సంరక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మొక్కల నాటకం లక్ష్యాల సాధనతో పాటు వాటి మనుగడకు కూడా అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్య కార్యక్రమాలను ముమ్మరం చేయడంతో పాటు నిల్వ నీరు లేకుండా చర్యలు చేపట్టాలని, దోమల నివారణకు యాంటీ లార్వా కార్యక్రమాలు, ఫాగింగ్ నిర్వహించాలని సూచించారు. తాగునీటి వనరులను పరిశుభ్రంగా ఉంచి, వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల నివారణపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, చెత్తను సకాలంలో తొలగించడం, కాలువలను శుభ్రపరచడం, పారిశుధ్య కార్మికుల పనితీరును పర్యవేక్షించడం ద్వారా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగాప్రభుత్వ పాఠశాలలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందుతున్న తీరు, వంటశాలల పరిశుభ్రత, పాఠశాలల పారిశుధ్యం, మౌలిక సదుపాయాలు, విద్యార్థుల హాజరు, బోధన ప్రమాణాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూ చించారు. ప్రభుత్వం అందిస్తున్న ఏకరూప దుస్తులను అర్హులైన ప్రతి విద్యార్థికి సకాలంలో పంపిణీ చేసి, పంపిణీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని ఆ దేశించారు. పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని వసతులు ఉండేలా చూడాలన్నారు, సదుపాయాలు సక్రమంప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలులో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విద్యా చందన , జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి నాగలక్ష్మి , జిల్లా పంచాయతీ అధికారి అనూష, అన్ని మండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీరాజ్ సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్లు, మిషన్ భగీరథ సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు మండల కేంద్రాల నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలి

- జి.సి.ఇ.ఓ, ఎం. జానకి దేవి




**ములకలపల్లి, జూలై 4 (ప్రజాజ్యోతి):** విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జి.సి.ఇ.ఓ, సెక్టోరియల్ అధికారి ఎం. జానకి దేవి అన్నారు. శనివారం ఆమె ములకలపల్లిలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదులను పరిశీలించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం పాఠశాలలోని బాత్రూమ్‌లు, స్టోర్‌రూమ్‌ను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందిస్తున్నారా అని వి ద్యార్థులను అడిగి తెలుసుకుని, వారితో కలిసి భోజనం చేశారు. భోజన నాణ్య త ప్రమాణాలు పాటిస్తూ మెనూ అమలు చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ప్రతి ఉపాధ్యాయు డు ప్రణాళికాబద్ధంగా పనిచేసి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని సూచించారు. నాణ్యమైన బోధనతో పాటు విద్యార్థుల అభ్యసన స్థాయిని నిరంతరం మెరుగుపరిచే చర్యలు చేపట్టాలని ఆమె తెలిపారు.

# డీఏ, పీఆర్సీ బకాయిలు వెంటనే చెల్లించాలి

- ఏఐవైఈయూఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి గరికే శ్రీనివాస్



**ములకలపల్లి, జూలై 24(ప్రజాజ్యోతి):** ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రావాల్సిన ఐదు డీఏలు, పీఆర్సీ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఆల్ ఇండియా ఎరుకల ఉద్యుగుల సమైఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి, హ్యూమన్ రైట్స్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చైర్మన్ గరికె శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం ములకలపల్లిలోని ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఐదేళ్లకోసారి పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరల (కాస్ట్ ఆఫ్ లివింగ్) ఆధారంగా పీఆర్సీని సవరించడం ఆనవాయితీ అయినప్పటికీ, ప్రభుత్వం ఆ ప్రక్రియను నిర్లక్ష్యం చేస్తోందని ఆయన విమర్శించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏలను విడుదల చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని, గతంలో ఎన్నడూ లేని విధంగా ఐదు డీఏలు పెండింగ్‌లో ఉంచడం వల్ల ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ వైఖరిని విమర్శించిన ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే తరహాలో ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను విస్మరిస్తోందని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలు, పీఆర్సీ బకాయిలను వెంటనే విడుదల చేసి ఉద్యోగులు, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో రాంజీ, నాగేశ్వర రావు, బన్సీలాల్, ఆదినారాయణ, ముక్తి, భద్రు, రాధ తదితరులు పాల్గొన్నారు.

# పామాయిల్ తోటలో పేకాట.. పోలీసుల మెరుపు దాడి

**దమ్మపేట,జూలై.4, (ప్రజాజ్యోతి):** దమ్మపేట మండల పరిధిలోని జమేదార్ బంజర గ్రామ శివారులో ఉన్న పామాయిల్ తోటలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో పోలీసులు శనివారం సాయంత్రం దాడి నిర్వహించారు. సాయంత్రం సుమారు 5:20 గంటలకు ఎస్ఐ తన సిబ్బందితో కలిసి పామాయిల్ తోటపై ఆకస్మికంగా దాడి చేయగా, అక్కడ పేకాట ఆడుతున్న వారిలో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. మరో ముగ్గురు పరారైనట్లు పోలీసులు తెలిపారు. దాడిలో రెండు మోటార్‌సైకిళ్లు, రూ.4,300 నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను పోలీస్ స్టేషన్‌కు తరలించి, వారిపై జూద నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.





సండే స్పెషల్

- వయసు చిన్నదే.. సంకల్పం పెద్దది..
- పచ్చదనాన్ని జీవిత ధ్యేయంగా మలుచుకున్న భద్రాద్రి చిన్నారులు
- 'ఏక్ పెడ్ మా కే నామ్'తో నైనిక తొలి అడుగు...
- 'వనజీవి' ఆశయాలతో 'వాక్ ఫర్ ట్రీస్' నినాదమెత్తిన చౌహాన్...
- ఒకరు 300 మొక్కలు నాటి వెయ్యికి పైగా మొక్కలను బహుమతిగా అందిస్తుంటే...
- మరొకరు 6 వేలకుపైగా మొక్కలు నాటి 10 లక్షల విత్తనాలతో అటవీకరణకు ఊతమిస్తున్నారు...

# చిన్న చేతుల్లో... పెద్ద చైతన్యం









**అభివృద్ధి పేరుతో పచ్చదనం క్రమంగా కనుమరుగవుతున్న వేళ... చెట్లను పెంచడమే తమ లక్ష్యంగా ముందుకు సాగుతున్న చిన్నారులు కూడా ఉన్నారు. మొబైల్ ఫోన్లు, వీడియో గేమ్ ల ప్రపంచంలో మునిగిపోతున్న నేటి తరంలో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ఇద్దరు చిన్నారులు మాత్రం ప్రకృతినే తమ ప్రపంచంగా ఎంచుకున్నారు. ఒకరు ప్రతి పుట్టిన రోజుకు మొక్కను నాటాలని సందేశమిస్తుంటే... మరొకరు ప్రతి ఉదయం ఒక మొక్క నాటడాన్ని జీవిత నియమంగా మార్చుకున్నారు. వయసు చిన్నదే అయినా, వారు ఎంచుకున్న మార్గం మాత్రం సమాజానికి పెద్ద సందేశాన్ని ఇస్తోంది. పచ్చని భవిష్యత్తు పట్ల బాధ్యత వయసుతో రాదని... మనసుతో వస్తుందని ఈ ఇద్దరు చిన్నారులు తమ చేతలతో నిరూపిస్తున్నారు.**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి :
(మాలోత్ అశోక్)

### ››› పచ్చదనమే లక్ష్యంగా నైనిక ప్రయాణం

కొత్తగూడెంలోని సెయింట్ మేరీస్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న 11 ఏళ్ల నైనిక రజువా చిన్న వయసులోనే పర్యావరణ పరిరక్షణను తన జీవిత లక్ష్యంగా మార్చుకుంది. 2024లో ప్రకృతి పరిరక్షణపై దీక్ష తీసుకున్న ఆమె, 'ఏక్ పెడ్ మా కే నామ్' కార్యక్రమం స్ఫూర్తితో తన తల్లి పేరుపై తొలి మొక్కను నాటి పచ్చదనం కోసం తన ప్రయాణాన్ని ప్రారంభించింది. ఇప్పటివరకు 300కు పైగా మొక్కలు నాటిన నైనిక, వెయ్యికి పైగా మొక్కలను ప్రజలకు బహుమతిగా అందించింది. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, ప్రజాప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖులకు మొక్కలను అందిస్తూ పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తోంది. పాఠశాలలు, సామాజిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక వేదికలు... అవకాశం వచ్చిన ప్రతిచోటా మొక్కల ప్రాధాన్యాన్ని వివరిస్తూ తన వంతు పర్యావరణ చైతన్యాన్ని విస్తరిస్తోంది. వేసవిలో మూగజీవాల కోసం నీటి తొట్టెలు ఏర్పాటు చేయడం, వ్యర్థ వస్తువులతో పర్యావరణ సందేశాలను ప్రతిబింబించే కళాఖండాలు రూపొందించడం కూడా ఆమె ప్రత్యేకత. ప్రస్తుతం కూచిపూడి నృత్యం, క్రికెట్ లోనూ ప్రతిభ కనబరుస్తున్న నైనిక... భవిష్యత్తులో జిల్లా కలెక్టర్ గా ప్రజలకు సేవ చేయడంతో పాటు పర్యావరణ పరిరక్షణను మరింత విస్తృత స్థాయిలో ముందుకు తీసుకెళ్లాలన్న లక్ష్యంతో అడుగులు వేస్తోంది.

### ››› వనజీవి ఆశయాన్ని కొనసాగిస్తున్న విశ్వామిత్ర..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన ఏడేళ్ల ముదు విశ్వామిత్ర చౌహాన్ మరో చిన్న పర్యావరణ యోధుడు. దివంగత 'వనజీవి' రామయ్య ఆశయాలను వారసత్వంగా స్వీకరించాడు. అతడు, 2022లో ప్రారంభమైన 'వాక్ ఫర్ ట్రీస్' కార్యక్రమంతో ప్రతిరోజూ కనీసం ఒక మొక్క నాటాలనే సంకల్పాన్ని జీవిత నియమంగా మార్చుకున్నాడు. ఈ చిన్నోడి సంకల్పాన్ని చూసి వృక్షో రక్షతి రక్షిత నినాదానికి ఇతనే నా వారసుడు అని వనజీవి రామయ్యనే నేరుగా ప్రకటించారు. ఇప్పటివరకు 'వాక్ ఫర్ ట్రీస్' నినాదానికి అనుగుణంగా ప్రతిరోజూ ఒక మొక్క నాటుతూ 1,493 రోజుల నిరంతర ప్రయాణాన్ని కొనసాగిస్తున్న చౌహాన్, అధికారులతో కలిసి 6 వేలకుపైగా మొక్కలు నాటాడు. ఇదే సమయంలో అడవుల్లో సేకరించిన వేప, మారేడు, నేరేడు, జీడి తదితర చెట్ల 10 లక్షల విత్తనాలను అటవీ శాఖకు అందజేసి అటవీకరణకు తన వంతు సహకారం అందించాడు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఖాళీ స్థలాల్లో నాటిన మొక్కల సంరక్షణను కూడా స్వయంగా పర్యవేక్షిస్తున్నాడు. అతని సేవలకు గుర్తింపుగా వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో స్థానం దక్కగా, అటవీ శాఖ ప్రశంసా పత్రంతో సత్కరించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ మంత్రులు, గవర్నర్లు, జిల్లా కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు సహా పలువురు ప్రముఖుల ప్రశంసలు అందుకున్నాడు. "చెట్టు నాటడం ప్రారంభం మాత్రమే... దాన్ని బతికించడం నిజమైన బాధ్యత" అనే భావనతో చౌహాన్ తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నాడు. అతని పర్యావరణ సేవలకు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు అండగా నిలుస్తున్నారు.



### ››› ఇవ్వాల్సింది ఆస్తి కాదు... అవగాహన

చిన్నారుల్లో పర్యావరణంపై అవగాహన పెంపొందితే రేపటి సమాజం సహజంగానే ప్రకృతి వైపు అడుగులు వేస్తుంది. మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం, నీటి వనరులను కాపాడడం, మూగజీవాల పట్ల కరుణ చూపడం వంటి విలువలు చిన్నప్పుడే అలవడితే అవే జీవితాంతం కొనసాగుతాయి. అందుకే పాఠశాలలు, తల్లిదండ్రులు కూడా పిల్లల్లో ఇలాంటి సామాజిక బాధ్యతను పెంపొందించే ప్రయత్నాలు చేయాల్సిన అవసరం ఉంది. పిల్లలకు ఖరీదైన బహుమతులు ఇవ్వడం కంటే ప్రకృతిని ప్రేమించే విలువలను నేర్పిస్తే... అదే వారికి జీవితాంతం నిలిచిపోయే గొప్ప సంపద అవుతుంది.

### ››› పచ్చని భవిష్యత్తుకు చిన్నారులే మార్గదర్శులు

సమాజంలో మార్పు తీసుకురావడానికి వయసు అవసరం లేదని నైనిక రజువా, విశ్వామిత్ర చౌహాన్ తమ చేతలతో నిరూపిస్తున్నారు. వారు నాటుతున్నవి కేవలం మొక్కలు కాదు... బాధ్యత అనే విత్తనాలు. వారు పెంచుతున్నవి కేవలం చెట్లు కాదు... ప్రకృతిని ప్రేమించే భావి తరాన్ని. ప్రతి ఇంట్లో ఇలాంటి ఒక చిన్నారి ఎదిగితే... ప్రతి గ్రామంలో ఒక పచ్చని ఉద్యమం మొదలవుతుంది. రేపటి తరానికి స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన జీవనం, పర్యావరణ బాధ్యతను అందించే నిజమైన రోల్ మోడల్స్ గా ఈ ఇద్దరు చిన్నారులు నిలుస్తున్నారు. వారి చిన్న చేతులు నేడు నాటుతున్న మొక్కలు... రేపటి సమాజానికి జీవవాయువుగా, ప్రకృతిని కాపాడే చైతన్యంగా మారబోతున్నాయి. ఇదే ఈ తరం చిన్నారులు సమాజానికి ఇస్తున్న గొప్ప సందేశం.

---

# నూతన ఎస్ఐ తిరుపతిని మర్యాదపూర్వకంగా కలిసిన నంగారా భేరి ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు



**టేకులపల్లి, జూలై04,ప్రజాజ్యోతి:** నంగారా భేరి లంబాడి హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో టేకులపల్లి పోలీస్ స్టేషన్‌కు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ కె. తిరుపతిని శనివారం మర్యాదపూర్వకం గా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సమితి నాయకులు మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణ కు, ప్రజా సమస్యల సత్వర పరిష్కారాని కి పోలీస్ శాఖ మరింత సమర్థవంతంగా పనిచే యాలని కోరారు.అలాగే ప్రజలకు అందుబాటులో ఉండే పోలీసింగ్‌ను అమలు చేస్తూ, పోలీసులు–ప్రజల మధ్య సమన్వయం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమం లో నంగారా భేరి లంబాడి హక్కుల పోరాట సమితి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు భూక్యా లాలు నాయక్, మండల అధ్యక్షుడు మూడ్ హుస్సేన్ నాయక్‌తో పాటు సమితి నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

# మార్కెట్ లో చిరు వ్యాపారుల ఆవేదన..!

- సరుకు పాడై... జనాలు రాక... గిరాకీ లేక చిరు వ్యాపారుల గగ్గోలు
- మోడల్ మార్కెట్‌లో బేరాలు లేక ఇబ్బందులు
- హోల్ సేల్ వ్యాపారుల పరిస్థితి అంతేనా?
- పాత మార్కెట్‌లోనే వ్యాపారం చేసుకునే అవకాశం ఇవ్వాలని వేడుకోలు
- వర్షం వస్తే నరక యాతన... -పట్టించుకోని అధికారులు..!
- తమ గోడును పట్టించుకోవాలంటున్న వైనం
- అధికారులు తమ సమస్యను పరిష్కరించరూ!









**ఇల్లందు, జులై 4 (ప్రజాజ్యోతి):** ఇల్లందు పట్టణంలోని మోడల్ మార్కెట్‌లో వ్యాపారం చేస్తున్న చిరు ఆకుకూరల వ్యాపారుల పరిస్థితి రోజు రోజుకూ దయనీయంగా మారుతుందని కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. మార్కెట్‌కు వినియోగదారుల రాకపోకలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో ప్రతిరోజూ తీసుకొచ్చే కూరగాయలు, ఆకుకూరలు అమ్ముడుపోక పాడైపోతున్నాయని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు చేసి సరుకు కొనుగోలు చేసినా గిరాకీ లేక నష్టాల పాలవుతున్నామని, కుటుంబ పోషణే భారంగా మారిందని వాపోతున్నారు. మోడల్ మార్కెట్‌ను ప్రజలకు అందుబాటులో ఉండేలా నిర్మించినప్పటికీ, అక్కడ వ్యాపారులకు అనుకూల పరిస్థితులు లేకపోవడంతో బేరాలు జరగడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. రోజంతా ఎదురుచూసినా కొద్దిమంది వినియోగదారులు మాత్రమే వస్తుండటంతో పెట్టుబడి కూడా తిరిగి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే వ్యాపారం మానుకోవాల్సిన పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిరు వ్యాపారులతో పాటు హోల్‌సేల్ వ్యాపారుల పరిస్థితి కూడా అంతే దారుణంగా ఉందని తెలుస్తుంది. పెద్ద మొత్తంలో కొనుగోలు చేసిన కూరగాయలు, ఆకుకూరలు నిల్వ ఉండి పాడవుతుండటంతో రూ. లక్షల్లో నష్టాలు చవిచూడాల్సి వస్తుందని వారు పేర్కొంటున్నారు. మార్కెట్‌లో కొనుగోలుదారులు లేకపోవడంతో వ్యాపారం పూర్తిగా మందగించిందని చెబుతున్నారు. ఏళ్ల తరబడి పాత మార్కెట్‌లోనే వ్యాపారం నిర్వహిస్తూ వినియోగదారులకు చేరువగా ఉన్నామని వ్యాపారులు గుర్తు చేస్తున్నారు. ప్రజలు ఇప్పటికీ పాత మార్కెట్‌కే వస్తున్నందున అక్కడే వ్యాపారం చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని అధికారులను వేడుకుంటున్నారు. బలవంతంగా మోడల్ మార్కెట్‌లోనే ఉండాలని ఒత్తిడి చేయవద్దని, తమ జీవనోపాధిని దృష్టిలో పెట్టుకొని నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు. అంతేకాకుండా అధికారుల సూచనల మేరకు మోడల్ మార్కెట్ లో తమకు కేటాయించిన షాపులకు సంబందించిన నెలవారీ కిరాయిని క్రమం తప్పకుండా చెల్లిస్తామని పేర్కొంటున్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతుందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం కురిసిన ప్రతిసారి మార్కెట్‌లో నీరు నిల్వ ఉండడం, బురద పేరుకుపోవడం వల్ల వినియోగదారులు రావడం లేదని, వ్యాపారం పూర్తిగా స్తంభించి పోతుందని చెబుతున్నారు. అంతేకాకుండా నూతన మోడల్ మార్కెట్ లో కొద్ది మంది వ్యాపారులకు మాత్రమే వ్యాపారం మంచిగా కొనసాగుతుందని, మిగిలిన హోల్ సేల్, చిరు వ్యాపారుల పరిస్థితి చెప్పుకొలేని విదంగా ఉందని తెలుస్తుంది. నూతన మోడల్ మార్కెట్ లో వ్యాపారాలు కొనసాగించే పరిస్థితి లేదని, తాము యధావిధిగా పాత మార్కెట్ లోనే వ్యాపారాలు కొనసాగిస్తామని, నూతన మోడల్ మార్కెట్ రూముల కిరాయిలను ప్రతినెల మున్సిపాలిటీకి చెల్లించేందుకు ఎక్కువ మంది వ్యాపారులు సిద్ధమైనట్లు సమాచారం. రోజుకు రూ. లక్షలు, వేలల్లో సరుకును తీసుకువచ్చి విక్రయాలు లేకపోవడంతో అవి పాడై పడవేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దింతో తమకు రోజువారీగా భారీగానే నష్టం వస్తుందని పేర్కొంటున్నారు. తమ సమస్యలను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడంతో నిరాశ చెందుతున్నామని, వెంటనే చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### ››› గిరాకీ లేక సరుకులు వృధా

నూతన మోడల్ మార్కెట్‌లో వినియోగదారుల రద్దీ లేకపోవడంతో ప్రతి రోజూ తెచ్చే కూరగాయలు, ఆకుకూరలు అమ్ముడుపోక పాడవుతున్నాయని వ్యాపారులు వాపోతున్నారు. పెట్టుబడులు తిరిగి రాక ఆర్థికంగా చితికిపోతున్నామని చెబుతున్నారు. తమ ఇబ్బందులను అధికారులు ఆలోచించాలని కోరుతున్నారు.

### ››› హోల్‌సేల్ వ్యాపారులకూ నష్టాలేనా?

పెద్ద మొత్తంలో కొనుగోలు చేసిన సరుకు నిల్వ ఉండిపోవడంతో హోల్‌సేల్ వ్యాపారులు కూడా తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని సమాచారం. కొనుగోలుదారులు లేక వ్యాపారం పూర్తిగా మందగించిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ››› పాత మార్కెట్‌కే అనుమతి ఇవ్వండి

గత కొన్ని ఏళ్ల నుంచి వ్యాపారాలు కొనసాగించిన పాత మార్కెట్‌లోనే వినియోగదారుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, అక్కడే వ్యాపారం చేసుకునే అవకాశం కల్పిస్తే తమ జీవనోపాధి కొనసాగుతుందని వ్యాపారులు అధికారులను కోరుతున్నారు.

### ››› వర్షం వస్తే నరకయాతనే

నూతన మోడల్ మార్కెట్ లో వర్షం కురిసిన ప్రతిసారి మార్కెట్‌లో నీరు నిల్వ ఉండటం, బురద పేరుకుపోవడం వల్ల కొనుగోలుదారులు రావడం లేదని, తమ సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు.

### ››› పాత మార్కెట్ లోనే విక్రయాలు జరిపేందుకు అనుమతి ఇవ్వండి: ధనమ్మ, ఆకుకూరల వ్యాపారి

గత కొన్ని ఏళ్ల నుండి ఆకుకూరల వ్యాపారం చేస్తున్నానని అధికారులు స్పందించి పాత మార్కెట్ లోనే ఎకరాలు జరిపేలా అవకాశం ఇవ్వాలి. నూతన మోడల్ మార్కెట్ లో విక్రయాలు లేక, జనం రాక, ఆకుకూరలు పాడవుతున్నాయి. ప్రతిరోజు రూ. వేలల్లో పెట్టుబడి పెట్టి ఆకుకూరలు తెప్పిస్తుంటే ప్రతిరోజు నష్టం వస్తుంది. కుటుంబ పోషణ భారంగా మారుతుంది. తమ పరిస్థితిని అర్థం చేసుకోవాలి.

### ››› ప్రతి రోజు ఆకుకూరలు పాడవుతున్నాయి: ఫాతిమా, ఆకుకూరల వ్యాపారి

తాను సుమారుగా 50 ఏళ్ల నుండి ఆకుకూరల వ్యాపారం చేస్తున్నాను. రోజుకు రూ. వేలల్లో పెట్టు పెట్టి కూరగాయలు తెప్పిస్తుంటే, అవి అమ్ముడుపోక నష్టం రావడంతో పాటు ఆకుకూరలు పాడవుతున్నాయి. ముఖ్యంగా నూతన మోడల్ మార్కెట్ లో జనం రాక విక్రయాలు జరగటం లేదు. వ్యాపారం కొనసాగకపోవడంతో జీవనం ఇబ్బందికరంగా మారింది. తమ ఇబ్బందులను అధికారులు అర్థం చేసుకోవాలి. పాత మార్కెట్ లోనే వ్యాపారాలు కొనసాగించేలా సహకరించాలి.

# ఒకవైపు ఉద్యమం... మరోవైపు విధి నిర్వహణ..!

- ఆరో రోజుకు చేరిన సింగరేణి అధికారుల రిలే నిరాహార దీక్షలు
- పే అప్‌గ్రేడేషన్, పీఆర్‌పీ, పదోన్నతుల కోసం కొనసాగుతున్న పోరాటం
- రోజువారీగా అధికారులు దీక్షల్లో... మిగిలినవారు విధుల్లో యథావిధిగా..
- సింగరేణి పనులకు ఎలాంటి ఆటంకం లేకుండా ముందుకు తీసుకెళ్తున్న అధికారులు..
- భట్టి విక్రమార్క ప్రకటనపై ఆశలు పెట్టుకున్నా... ఎలాంటి స్పష్టత లేక నిరాశ



ఐదో రోజు సింగరేణి వ్యాప్తంగా రిలే నిరాహార దీక్ష చేసిన మహిళా అధికారులు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జులై 4, ప్రజాజ్యోతి :** పే అప్‌గ్రేడేషన్ అమలు, పర్‌ఫార్మెన్స్ రిలేటెడ్ పే (పీఆర్‌పీ) బకాయిల చెల్లింపు, పారదర్శక పదోన్నతులు తదితర డిమాండ్ల సాధన కోసం సింగరేణి అధికారులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆరో రోజుకు చేరుకున్నాయి. 137 ఏళ్ల సింగరేణి చరిత్రలో తొలిసారిగా అధికారులు ఉద్యమబాట పట్టడం ఒకవైపు చర్చనీయాంశంగా మారగా, మరోవైపు సంస్థ కార్యకలాపాలకు ఎలాంటి అంతరాయం కలగకుండా విధులను యథావిధిగా నిర్వహించడం ఈ ఉద్యమానికి ప్రత్యేకతగా నిలుస్తోంది.సాధారణంగా ఉద్యోగ సం ఘాల ఆందోళనలు ఉధృతమైతే కార్యాలయాల పనితీరుపై ప్రభావం కనిపించడం సహజం. అయితే సింగరేణి అధికారుల ఉద్యమంలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. ప్రతిరోజూ విడుదలవారీగా కొందరు అధికారులు మాత్ర మే రిలే నిరాహార దీక్షల్లో పాల్గొంటుండగా, మిగిలిన అధికారులు గనుల నిర్వహణ, ఉత్పత్తి, భద్రత, ప్రాజెక్టుల పర్యవేక్షణ, సాంకేతిక, పరిపాలనా విధులను యథావిధిగా నిర్వహిస్తున్నారు. సంస్థ పనితీరుకు ఎలాంటి ఆటంకం కలగకుండా పరస్పర సమన్వయంతో విధులు నిర్వర్తిస్తున్నారు. అధికారుల వాదన ప్రకారం, తమ ఉద్యమం సింగరేణికి వ్యతిరేకంగా కాదని, సంస్థ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న అధికారులకు రావాల్సిన న్యాయమైన హక్కుల సాధన కోసమేనని చెబుతున్నారు. అందుకే ఒకవైపు రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తూనే, మరోవైపు సంస్థ ప్రయోజనాలకు ఎలాంటి భంగం కలగకుండా విధులు నిర్వహిస్తున్నామని పేర్కొంటున్నారు. సింగరేణి అభివృద్ధి, ఉత్పత్తి, పరిపాలనపై తమ నిబద్ధత ఎప్పటికీ కొనసాగుతుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు.ఇదిలా ఉండగా, శుక్రవారం ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన నిర్వహించిన సింగరేణి సమీక్ష అనంతరం జరిగిన మీడియా సమావేశంపై అధికారులు ఆశలు పెట్టుకున్నారు. పే అప్‌గ్రేడేషన్, పీఆర్‌పీ బకాయిలు, పదోన్నతుల వంటి పెండింగ్ అంశాలపై ఏదైనా సానుకూల ప్రకటన వెలువడుతుందనే ఆశాభావంతో ఎదురుచూశారు. అయితే ఆ మీడియా సమావేశంలో అధికారుల డిమాండ్లపై ఎలాంటి ప్రకటన వెలువడకపోవడంతో ఉద్యమంలో పాల్గొంటున్న అధికారుల్లో కొంత నిరాశ వ్యక్తమైనట్లు అధికార వర్గాల్లో చర్చ సాగుతోంది. అయినప్పటికీ ప్రభుత్వం, యాజమాన్యం త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకుంటాయని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికే అధికారుల రిలే నిరాహార దీక్షలకు పలు కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు సంఘీభావం ప్రకటించారు. దీంతో ఈ ఉద్యమం క్రమంగా మరింత ప్రాధాన్యం సంతరించుకుంటోంది. యాజమాన్యం చర్చలకు ముందుకొచ్చి పే అప్‌గ్రేడేషన్, పీఆర్‌పీ బకాయిలు, పదోన్నతుల అంశాలపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని అధికారులు కోరుతున్నారు. న్యాయమైన డి మాండ్లపై సానుకూల హామీ లభించేవరకు రిలే నిరాహార దీక్షలను కొనసాగిస్తామని వారు స్పష్టం చేస్తున్నారు. ఒకవైపు హక్కుల సాధన కోసం రాజీపడకుండా ఉద్యమం కొనసాగిస్తూనే, మ రోవైపు సింగరేణి కార్యకలాపాలు ఎక్క డా దెబ్బతినకుండా విధులను నిర్వర్తించడం ప్రస్తుతం అధికారుల ఉద్యమం లో ప్రత్యేకంగా కనిపిస్తున్న అంశంగా మారింది. ఇదే అంశం సింగరేణి వర్గాల్లోనూ చర్చకు దారితీస్తోంది.